ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకా దేవి పురాణము

## చతుర్ధశాధ్యాయము

### మల్బారుని త్యాగము - అతని వంశీయులు మైలారులగుట :-

సాలంకాయనుడిట్లు చెప్పదొడగెను. ఓ మణిగుప్తాదులారా! మరునాటి ఉదయమున సమస్త ఆర్యవైశ్యులు మరల శ్రీ నగరేశ్వరాలయ మంటపమందు సమావిష్టులైరి. కొంత తడవునుక మల్బారుడు ఆ సభాస్థలికి అరుదెంచెను., అతడు భాస్కరునితో "ఆచార్యవర్యా! మీ యాజ్ఞమేరకు 103 అగ్ని కుండములను నిర్మించితిమి. గురుదేవా! అందరి ప్రవేశమునకు మీచేగర్తములు నిర్ణయించబడినవి. కాని నాకు ఏ గర్తమో చెప్పబడలేదు. దయచేసి నాకు గూడ అగ్నిప్రవేశమునకు అనుమతినిండు. నేనుకూడా యజమానులైన అర్యవైశ్య ముఖ్యులతో పాటుగ అగ్నిలో ప్రవేశించి ముక్తిని పొందవలెను. కనుక నాకు శ్రేష్ఠమైన మోక్షస్థానమెక్కడ కలదో నిర్ణయించి చెప్పుడు" అని పరిపరివిధముల ప్రార్థించెను. భక్తి విధేయుడైన ఆ మల్బారుని త్యాగబుద్ధిని గని భాస్కరాచార్యుడు, అవిద్యావంతులు, శూద్రులునైన వారితోకూడ ధర్మరక్షణకై ప్రాణములను బలివెట్టగల అమోఘత్యాగశక్తిని కలిగించిన వాసవీ కన్యక యొక్క అహింసాయుత వినూతన పోరాట విధానమును మిక్కిలిగ ప్రశంసించినవాడై మల్బారునితో "ఓయీ! ఉత్తరపు దిక్కున వెలుపల మండుచుండు అగ్నికుండము నీకు మోక్షము నీయగలదు అని చెప్పగ, వాసవీకన్యక ఆ మల్బారుని గాంచి "ఓ త్యాగమూర్తీ! మల్బారా! ఇక నీ వంశపు వారందరును మల్బారులని పిలువబడగలరు. కాలక్రమమున వారే మైలారులుగ ప్రసిద్ధిలగుదురు. వారు వంశపారంపర్యముగ వైశ్యులను సేవించుచు

వారిచే పోషింపబడుచు సుఖమయ జీవనమును గడపుకొనగలరు." అని ప్రకటించినది. అంత వాసవీకన్యకా నామముతోను, మల్హారుని పేరిటను అచ్చటి వారందరురను దిక్కులు పిక్కటిల్లు విధమున జయఘోషలు సలిపిరి.

## వాసవీబాల కన్యకావ్రతమాచరించుట :-

అప్పుడు వాసవీబాల గురువునకు సభకు నమస్కరించి "సభాసదులారా! నేను యీ దినము నుండి కన్యకావ్రతదీక్షను స్వీకరించుచున్నాను. యోగమాయా స్వరూపిణియైన వింధ్యవాసినీ దేవ్యాలయములో నా వ్రతాచరణకు ఏర్పాట్లు గావింపుడు. నాకెట్టి కావలియు పెట్టవలదు." అని చెప్పినది. తోడనే కుసుమశ్రేష్ఠి గురుని ఆనతితో వ్రతమునకు వలసిన ఏర్పాట్లు గావించుటకై మంత్రులను ఆదేశించెను. వెంటనే వింధ్యవాసినీదేవ్యాలయ ప్రాంగణము ముత్యాలతోరణములతోను సమస్త మంగళ వస్తువులతోడను అతిలోక సుందరముగ అలకరించబడినది. వైశ్యరాజభటులు యీవ్రత వార్తను నగరతమంతటను తెలియజేసిరి. వైశ్యులందరు తమతమ గృహములకు పోయి సుస్నాతులై నూతన వస్త్రాభరణములను ధరించి ఆశ్రితులకు, దీనులకు ధనకనకవస్తు వాహనములను దానముగనిచ్చి వింధ్యవాసినీ దేవ్యాలయమునకు విచ్చేసిరి.

అంత వాసవీకన్యకను అలంకరించుటకై కుసుమాంబాది వైశ్య వనితామణులు ఆనందోత్సాహములతో అక్కడికరుదెంచిరి. తొమ్మిదిమంది కన్యలు ఝుణఝుణమని ధ్వని చేయు కంకణ కంఠహారములు యిటనటు సంచలించుచుండగ అద్దాల వంటి కపోలముల నుండి స్వేద బిందువులు జాలువార, వాసవీకన్యకకు అభ్యంగన స్నానము చేయించిరి. మనోజ్ఞమైన, స్వర్ణ పీతాంబరమును ధరింపజేసిరి. ఒక మహిళ వాసవీకన్యక ముఖ మండలముపై కస్తూరీ తిలకము దిద్దగ మరొక వైశ్యాంగన మణిమయములైన కర్ణాభరణములతో, మంచిముత్యముల హారములతో, రత్నఖచితములైన హస్త

భూషణములతో ఆమెనలంకరించినది. వేరొక వనిత అందములొలుకు అందెలను, నవరత్నఖచితమైన వడ్డాణమును, సుందరాతిసుందరములైన మంజీరములను వాసవీకన్యకచే ధరింపజేసినది. ఇట్లు వాసవీకన్యకను అలంకరించి ఊహాతీత సౌందర్యరాశియైన ఆ ముగ్ధమోహనమూర్తిని తిలకించుచు ఆ కన్యక గావించనున్న అగ్ని ప్రవేశ విషయమును తలచి తలచి హా! ఎంతకష్ట మెంతకష్టమని గోడుగోడున ఏడువసాగిరి. అజ్ఞానము వలన కలిగిన వారి దుఃఖాతిశయమును గమనించిన కన్యక దేవతలకు, మునులకు గూడ దుర్లభదర్శనీయమైన తన దివ్యరూపమును వారికి చూపించినది. లీలాశుక పద్మములను, వరదాభయముద్రలను ధరించి చతుర్భుజియై సమస్త దివ్యాభరణములతో శోభిల్లుచు రాశిపోసిన సౌందర్యమాయన నొప్పు బాలా త్రిపురసుందరి వలె సాక్షాత్కరించిన వాసవీకన్యకను చూచి అచ్చటి స్త్రీలందరు ఆనందపరవశులైరి. ప్రేమపూరితనేత్రాలై సంభ్రమముతో ఆమెను వీక్షించిరి. అనంతరము వాసవి తన దివ్యరూపమునందు ధరించిన నాసికాభరణమును మాత్రమే వుంచుకొని మిగిలిన అద్భుత అలౌకిక రూపమును అంతర్ధాన మొనరించినది. అచ్చటి వారందరును ఆ విచిత్ర లీలను జూచి విస్మయము నందిరి. వారియందు భక్తి ప్రవత్తులు పెల్లుబికినవి.

అంతట వాసవీకన్యకను ఒక సమున్నతాసనముపై కూర్చుండజేసిరి. గురు భాస్కరాచార్యుడు ఆ వనితామణులచే వాసవీ కన్యకను షోడశోపచార విధులతో పూజింపజేసెను. అటుపై వాసవీబాల వారితో "గురుదేవా! తల్లిదండ్రులారా! ఆత్మబంధువులారా! యీ దినము నేనీ దివ్యాలయములో ఏకాంతముగ వుండెదను. నాకెటువంటి రక్షణ ఏర్పాట్లు చేయవలదు." అని ఆదేశించినది. ఆమె పలుకులువిని అందరును వాసవీబాల యొక్క లీలా మహత్యములను గూర్చి ముచ్చటించు కొనుచు నిశ్చింతులై తమ తమ గృహములకు వెడలిపోయిరి. వాసవి వింధ్యవాసినీదేవీ సన్నిధియందు పద్మాసన స్థితయై ధ్యాననిమగ్నయైనది. అంత విష్ణువర్ధనరాజునొసట

వ్రాసిన వ్రాత వలె సూర్యుడస్తమించెను. ఆ చక్రవర్తియొక్క అజ్ఞానమువలె చీకటి ఆవరించినది. ఆకసమంటుచున్న ఆర్యవైశ్యుల కీర్తికల్పలతా సుమమంజరులవలె గగనమున చుక్కలు వెలిగినవి.

## వాసవిని బంధింపవచ్చిన విక్రమకేసరి భక్తుడుగ మారుట :-

వాసవిని బంధించుటకై అదనుకొరకు ఎదురుచూచుచున్న విష్ణువర్ధనుని సేనానియగు విక్రమకేసరికి మంచి అవకాశము లభించనది. అతడు ఆ నిశీథిలో దొంగవలె దేవాలయములోనికి ప్రవేశించెను. అక్కడ ఏకాంతములో ధ్యాన నిగమ్నయై మూర్తీభవించిన ప్రశాంతతవలె నున్న వాసవిని తిలకించెకను. ఆమెను బంధించుటకై ముందడుగు వేయునంతలో ఆకస్మికముగ ఆమె శరీరము నుండి, కోటి మెరపుతీవెల ప్రకాశమొక్కసారిగ ప్రకటమయినది. దుర్నిరీక్ష్యమైన ఆ అద్భుతకాంతిని విక్రమకేసరి చూడజాలకపోయెను. కన్నులు నలుపుకొని చూచెను. అంతయు చీకటి, అతనికి ప్రపంచమంతయు అంధకారమయముగ తోచినది. కండ్లలో అసహనీయమైన జ్వలనబాధ చెలరేగినది. నేను గ్రుడ్డివాడనైతినని అతడు గ్రహించెను. తన దుశ్చర్యకు అది ఫలితమని నిశ్చయించుకొనెను. వెంటనే వాసవీకన్యక చరణముల చెంతపడి ఘోరముగ విలపించసాగెను." "అమ్మా ఓ వాసవీకన్యకా దేవి! నీవు జగన్మాతవైన ఆదిపరాశక్తివి. అఖిల జీవులును నీ మాయాపాశముతో బంధించి ఆటబొమ్మల వలె ఆడించు పరాశక్తివైన నిన్ను అత్యంత అల్పుడనైన నేను బంధించుటకు అజ్ఞానపూరితుడనై పూనుకొంటిని. బ్రహ్మాదులకే అరయశక్యముగాని నీ మహిమ నెరుగుటకు నేనెంతటి వాడను తల్లీ. నా పాపమునకు నిష్కృతిలేదు. ఐనను కరుణా సముద్రవగు నీవు నాపై కనికరించి నా దోషములను మన్నించుము. నాకు జ్ఞానదృష్టిని ప్రసాదింపుము. అబ్బా! అసహనీయమైన యీ బాధను ఉపశమింపజేసి రక్షింపుము లేదా నన్ను వెంటనే కడతేర్చి శిక్షింపుము. ఓ

పరాశక్తీ! నీకు నమస్కృతులు. ఓ సర్వలోక శరణ్యా! నన్ను కాపాడుము. అని దీనాతిదీనుడై అనేక విధముల ప్రార్థించెను.

అపుడా శరణాగతరక్షకియైన వాసవీకన్యక వానిని చూచి "నాయనా విక్రమకేసరి! పశ్చాత్తాపమును మించిన ప్రాయశ్చిత్తములేదు. నీకు దృష్టిని ప్రసాదించుచున్నాను. నిరంతరము దేవీధ్యాన నిమగ్నుడవై కీర్తిమంతుడవు కాగలవు." అని ఆశీర్వదించినది. తోడనే విక్రమకేసరి అంధత్వము తొలగి పోయినది. అతడు ప్రశాంత ప్రసన్నమూర్తియైన వాసవి కన్యకను తిలకించి, పరిపరి విధముల ప్రస్తుతించి ఆమెకు పరమభక్తుడుగ మారిపోయెను. అటుపై ఆ దేవి యొక్క అనుజ్ఞను వడసి, తన నెలవునకు వెడలిపోయెను.

## ఆత్మార్పణలకై సంసిద్ధులైన ఆర్యవైశ్యుల నగర ప్రదక్షిణము :-

మరునాటి ఉదయమన ఆర్యవైశ్యులందరును భాస్కరాచార్యునిచే జెప్పబడిన వారై అభ్యంగన స్నానములాచరించి జ్ఞానత్యాగవైరాగ్య చిహ్నములైన సంధ్యారుణవర్ణపు కాషాయ వస్త్రములను ధరించిరి. ఆశ్రితులకు విప్రులకు అనేక విధముల దానములనిచ్చి వింధ్యవాసినీ దేవ్యాలయమునకు వచ్చి పరాంబికను అచంచల భక్తితో అర్చించిరి. వాసవీకన్యకామణితో గూడి నగర ప్రదక్షిణమునకై బయలుదేరిరి. వైశ్యరాజ బంధుగులు, అధికారులు, రథ, గజ, తురగములను అధిరోహించి రాకుమార్తెయైన వాసవిని రతనాల పల్లకిపై గూర్చుండబెట్టుకొని నగరేశ్వరాలయమునకు చేరుకొనిరి. అక్కడ గౌరీ నగరేశ్వరులకు మహన్యాసపూర్వకముగ రుద్రాభిషేకాదులతో సమస్తోపచార పూజలు చేయించిరి, కోనకమలాజనార్ధనుల దేవాలయమునకు విచ్చేసిరి. అచ్చట లక్ష్మీనారాయణులను అపూర్వ భక్తి శ్రద్ధలతో అర్చించి, మంగళతూర్య నాదములతో, భేరీమృదంగధ్వనులతో, వందిమాగధవైతాళికుల స్తోత్రపాఠములతో వీణావేణు

మృదంగాది వాద్యగానములతో వేదవేదాంగ విదులైన విప్రవరుల మంత్ర ఘోషతో నగర ప్రదక్షిణము గావించి గౌతమీ తీరమున గల భాస్కరాచార్యుని ఆశ్రమమునకు చేరుకొనిరి. భాస్కరాచార్యుడు, బ్రహ్మకుండ సమీపమందలి సువిశాలమైదానమున గల అగ్ని చక్రప్రదేశములో జరిగిన కుండ నిర్మాణ విధానములను తెలియపరచి అటుపై వైశ్యులాచరించవలసిన భవిష్యత్ కార్యక్రమములను గూర్చి విశదపరుపసాగెను.

## విష్ణువర్ధనునికి అపశకునములు కలుగుట :-

అని చెప్పుచుండిన సాలంకాయన మహర్షితో మణిగుప్తాది వైశ్యులు ఓ గురువరేణ్యా వైశ్యుల అగ్ని ప్రవేశము గూర్చి విక్రమకేసరిచే పంపబడిన వార్తనందుకొనిన చక్రవర్తి వూరకుండెనా? ఏమిచేసెనో దయతో వివరింపుము." అని ప్రార్థించిరి.

అంత సాలంకాయనుడివట్లు చెప్పదొడగెను. "ఓ వైశ్యోత్తములారా! పద్మశయనములో విష్ణువర్ధన చక్రవర్తి, విక్రమకేసరి పంపిన వార్తనందుకొని, మిక్కిలి క్రోధావేశపూరితుడై విజయసింహుడను మంత్రిని బిలచి "ఓ అమాత్యవర్యా! నీవు వెంటనే చతురంగబలములతో పెనుగొండకు పోయి ఆ వైశ్యుల అగ్నిప్రవేశ కార్యక్రమమును ఆపివేసి వారిని బందీలను చేయవలెను. రేపటి ప్రభాత వేళకు మేమును పెనుగొండకు బయలుదేరగలము. వాసవిని రాక్షసమున పెండ్లాడగలము." అని ఆజ్ఞాపించి పంపించెను. అటుపై విష్ణువర్ధన చక్రవర్తి అంతఃపురమును చేరెను. అతనికి విపరీతమైన ఆకలి కలిగినది. అంతఃపురకాంతలు వజ్రవైఢూర్య మయములైన కాంచనపాత్రలలో పరిమళములీను షడ్రసోపేతమగు భోజనము సమకూర్చిరి. రాజు భుజించనారంభించగనే ఆ భోజ్యపదార్థములన్నియు దుర్గంధయుతములుగను, దుష్టమాంస మయములుగను, రక్తముతో గూడినవిగను, అశుద్ధగంధములు

అరుచికరములునైనవిగను కనబడినవి. అంత చక్రవర్తి ఆ యన్నమును వదలి దప్పికగొన్నవాడై క్షీరపాత్రను చేబూనెను. కాని ఆ పాత్రలోని పాలలో యిటునటుపాకులాడు పురుగులు కనిపించినవి. అప్పుడు విష్ణువర్ధనుడు క్రోధావేశ పూరితుడై ఆహార పానీయములను విసర్జించి లేచి భోజన పదార్థములను తయారుచేసిన వంటవారిని కఠినముగ శిక్షించబూనుకొనెను. వారు భయకంపితులై "మహాప్రభూ! మేము అనుదినమువలెనే రుచిగ, శుచిగ నుండునట్లు యీ ఆహార పదార్థములను తయారుచేసితిమి. మేము ఏ పాపమును యెఱుగము. ప్రమాణము చేసి చెప్పుచున్నాము." అని ప్రభువు పాదాములపై బడి ప్రాణరక్షణకై వేడుకొనిరి.

చక్రవర్తి జరిగిన విపరీత పరిణామముల గూర్చి చింతించుచు శయనాగారమునకు చేరి పాన్పుపై పరుండెను. అతని మనస్సంతయును వికలమైపోయినది. అంతట వానికి స్వప్నమునందున కరాళవక్త్రయు, శూలహస్తము, చతుర్భుజియు, కాటుకకొండ వంటి నల్లని శరీరకాంతి గలదియు, ఘోరమైన దంష్ట్రలు గలదియు, వికృతాకారిణయునైన కాళికాశక్తి సార్వభౌముని శిరస్సును శూలముతో పగులగొట్టుచున్నట్లును, పాదములతో అతని రొమ్మును, గొంతుకను త్రొక్కుచున్నట్లును గోచరించినది. చక్రవర్తి భీతచిత్తుడై వణకుచు దిగ్గునలేచి హాహాకారము గావించెను. అది విని అంతఃపుర పరివారమంతయు పరుగుపరుగున అచ్చటికి వచ్చినది. ఈ వార్తవిని సేనాపతులు, మంత్రులు అరుదెంచిరి. చక్రవర్తికి కలిగిన యీ విచిత్రానుభూతులు ఆ ప్రభువునందుద్భవించిన ఆందోళనాధిక్యత వలన ఏర్పడినవని నిర్ణయించి శాంతికొరకై పొలిమేరశక్తులకు, గ్రామదేవతలకు పలువిధముల జీవబలులను సమర్పించు ఏర్పాట్లు గావించిరి. అటుపై విష్ణువర్ధనుడు స్వస్థచిత్తుడై కుమారుడైన రాజేంద్రుని నగరములో నిలిపి చతురంగ బలసమేతుడై పెనుగొండ పట్టణమునకు బయలుదేరెను.

# పెనుగొండను ముట్టడించిన విజయసింహుని విక్రమకేసరి ఎదుర్కొని వానిచే చంపబడుట :-

ఇటు చక్రవర్తిచే పంపబడి ముందుగా పెనుగొండకు సైన్యసమేతుడై వచ్చిన విజయసింహుడు పెనుగొండ నగరమును ముట్టడించెను. వాసవీకన్యక భక్తులుగ మారియుండిన విక్రమకేసరియు వాని వేలాది సైనికులు ఆర్యవైశ్యుల అహింసాదీక్షకు భంగము వాటిల్లకుండజేయుటకై విజయసింహుని సైన్యములను నగరమునకు వెలుపలనే ఎదుర్కొని నిలిపివేసిరి.

అంత విక్రమకేసరి నూతనముగ వచ్చిన చక్రవర్తి సైన్యములకు పెనుగొండలో జరిగిన ఉదంతమును వాసవీకన్యక యొక్క మహత్యమును, వైశ్యుల అహింసావ్రతదీక్షము గూర్చి సవివరముగ విన్నవించి దుష్టుడైన చక్రవర్తికొరకై పాపమునకు పాల్పడవలదని ప్రార్థించెను. విక్రమ కేసరి చెప్పిన విషయములను విన్న విజయసింహుని సైనికులందరును తమ చక్రవర్తిని దూషించుచు వాసవీకన్యక యొక్క భక్తులుగ మారిపోయిరి. కాని విజయసింహుడు మాత్రము కత్తిదూసి నిరాయుధుడై వున్న విక్రమకేసరిపై అకస్మాత్తుగ దూకి అతనిని మరికొందరు సైనికులను వధించివేసెను. అన్యాయమైన యీ క్రూరకృత్యమును చూచిన సైనికుల హృదయములు క్రోధావేశములతో భగ్గున మండిపోయినవి. వారందరును ఉన్మత్తులవలె విజృంభించి విజయసింహుని చుట్టుముట్టి ఆ దుష్టుని ఖండఖండములుగ నరికివేసిరి. అంతట వారందరును వైశ్యుల త్యాగదీక్షను, వాసవీ కన్యకా మహత్వమును వేనోళ్ళ కీర్తించుచు వైశ్యులు సమావిష్టులైయున్న భాస్కరాచార్యుని ఆశ్రమ ప్రాంగణమునకు చేరుకొనిరి.

## విక్రమ కేసరి వంశీయులు వీరముష్టులుగ ప్రసిద్ధులగుట :-

జరిగిన ఉదంతమంతటిని విన్న వాసవీకన్యక వైశ్యులను జూచి "ఓ మహావైశ్యులారా! మనకొరకై ప్రాణములనర్పించిన విక్రమకేసరిని వాని వీరభటులకును వైశ్యకులమెంతగానో ఋణపడివున్నది. ఇకమీదట ఆ వీరభటుల వంశముల వారు వీరముష్టులను పేర ప్రసిద్ధులు కాగలరు. వంశపారంపర్యముగ వారి కుటుంబములను వైశ్యులు పోషించుచుండవలెను. వీరముష్టులు వైశ్యుల శుభకార్యములలో తమ త్యాగవీరలాంఛనములతో కూడిన ప్రభలను కట్టుకొని వచ్చి వైశ్యులను సేవించుచుండవలెను. ఇదియిక వైశ్యులకు కులాచారమై వర్ధిల్లగలదు." అని ప్రకటించినది. అపుడచటి ప్రజానీక మంతయు ఆశ్చర్యచకితమై "శ్రీ వాసవీకన్యకాదేవి ప్రబోధించిన అహింసాయుత నూతన రణవిధానప్రభావముతో వేలాది సైనికులలోని దుష్టత్వము అంతరించినది. హింసాప్రవృత్తి నశించినది. త్యాగశక్తి పెల్లుబికినది. ఇహలోక కళ్యాణమునకై శ్రీ వాసవీ కన్యక జూపిన యీ వినూత్న మార్గమే ప్రపంచమున కనుసరణీయము, ఆచరణీయము, ఆదర్శప్రాయము, సర్వోత్తమము అని అందరును ముక్త కంఠముతో కీర్తించుచు అమరులైన వీరముష్టుల పేరిటను, ఆదిపరాంబికావతారిణియైన వాసవీకన్యక పేరిటను దశదిశలు నిండిపోవునట్లు విజయఘోషలు గావించిరి.

## 102 గోత్రముల ఆర్యవైశ్యుల అగ్నిప్రవేశ సంసిద్ధత-అగ్నిదేవుని ఉదాసీనత:-

అనంతరము ఆర్యవైశ్యులును అన్యప్రజలును బ్రహ్మాకుండమునకు అనతి దూరములోనున్న ఆత్మాహుతి యజ్ఞశాలకు బయలుదేరిరి. సకల ప్రాణిభయంకరుడైన అగ్నిహోత్రుడు సమస్త అగ్ని కుండములలో భయంకర జ్వాలామాలికలతో పైకెగసి ఆకాశమునంటుమంటలతో ప్రకాశించుచుండెను. శ్రీ వాసవీకన్యక ప్రజలందరకును

ఆదర్శమయ జీవనము గడుపుకొనుటకనువైన ధర్మసారమును ఉపదేశించి, ఆత్మీయులందరి వద్ద సెలవుతీసుకొన్నది. ఆమె ఆదేశమును అనుసరించి నూట యిద్దరు పుణ్యదంపతులను కుండములను నిర్మించిన మల్హారుడును, తమకై నిర్దేశింపబడియుండిన అగ్ని కుండముల చెంతకు చేరిరి. వారు తమతమ కుండములకు ముమ్మారు ప్రదక్షిణముగావించి అగ్నిలో ప్రవేశించుటకు సంసిద్ధులై నిలచిరి. జాజ్వల్యమానముగ ప్రకాశించుచున్న ఆ అగ్నికుండముల మధ్య, సమస్త గ్రహోపగ్రహగోళముల మధ్య వెలుగొందుచున్న పరాశక్తి వలె ప్రకాశించుచు వాసవీకన్యక తనకై ఏర్పరచిన ప్రధానాగ్ని కుండము చెంత ధ్యాననిమగ్నమై నిలచినది.




102 గోత్రజ ఆర్యవైశ్య దంపతులు - అగ్నిప్రవేశ దృశ్యము

అంతట అగ్నిహోత్రుడు తన దహనసామర్ధ్యమును ఆ క్షణములో చాలించి చల్లబడిపోయెను. ఆ వింతచూచి జనులందరును అబ్బురపడిరి. అప్పుడు వాసవీకన్యక చల్లారియుండిన కుండములను చూచి అనలదేవునుద్దేశించి "ఓ స్వాహావల్లభా! నీవు వెంటనే ప్రత్యక్షమై నాకు సాన్నిధ్యము నిడుదువు గాక." అని ఆదేశించినది.

అంతట అగ్నిహోత్రుడు ఇతరులెవ్వరికిన అగుపడనివాడై వాసవీదేవికి మాత్రమే కనబడుచు "ఓ జగన్మాతా! పరాశక్తివగు నిన్నును, ధర్మపరాయణులు, త్యాగమూర్తులు నైన యీ వైశ్యశ్రేష్ఠులను నేను దహింపజాలను. ఇట్టి వారిని దహించిన పాపము నన్ను కట్టి కుడుపగలదు. అందులకే మహాత్ములజోలికి పోవుటకు భయపడుచున్నాను." అని ఎల్లరకు వినబడునట్లు పలికెను. ఆ పలుకులు విన్న సమస్త జనులు ఆశ్చర్యమగ్నమానసులైరి.

అంత వాసవీకన్యక అగ్నిహోత్రునితో "ఓ అగ్నిదేవా! నీవు సర్వలోక వ్యాపకుడవు. సర్వభూతాంతరాత్మవైనవాడవు. భూత భవిష్యద్వర్తమానములను తెలిసినవాడవు. ఇప్పుడు అగ్నిప్రవేశము గావించనున్న 102 గోత్రముల వైశ్యులు పూర్వము కైలాసవాసులైన సిద్ధవైశ్యులు. వారు లోక కళ్యాణార్థమై భువినవతరించిరి. పూర్వము త్రిమూర్తులును, నేనును వీరికిచ్చిన వరముల ననుసరించి వీరికిప్పుడు అగ్నిముఖమున కైవల్యమును ప్రసాదించుచున్నాను. భండాసురాంశాసంజనితుడైన విష్ణువర్ధనుని నిమిత్తముగ జేసుకొని, యీ కలియుగమున అధర్మదుష్టత్వములను త్యాగాహింసల ప్రభావముతో అంతమొందించి, వర్ణాశ్రమాచారములను రక్షించి ధర్మప్రతిష్ఠాపనగావించుటకై ఏర్పడిన నా అవతారకార్యము యిప్పటితో ముగిసిపోయినది. పాపాత్ముడైన విష్ణువర్ధనుడు మరణించు సమయమాసన్నమైనది. కనుక నీవు నా ఆదేశానుసారము నీ కర్తవ్యమును నిర్వహింపుము. కాల విలంబనము చేయకుము." అని ఆజ్ఞాపించి,



అగ్నిప్రవేశానంతరం వాసవీదేవి తన నిజ స్వరూపమైన విశ్వ రూపమును చూపించుట దృశ్యము

అటుపై అచ్చటి ప్రజలను గాంచి "ఓ భక్తువరులారా! బ్రహ్మావిష్ణు మహేశ్వరులును, వాణీరమాపార్వతులును మొదలైన సమస్త దేవతలు నేనేయై వున్నాను. ఇంతయేల యీ సమస్త చరాచర సృష్టియంతయు నా ఏకాంశా సంభూతమై యున్నది. నేను కాని దేదియు యీ విశ్వవిశాంతరాళమున లేదని తెలియును." అని పలికినది. అంతట జనులందరును "ఓ దేవదేవేశ్వరీ! విశ్వమంతయు నీవే యనుచున్నావు. అపారకరుణాసముద్రవై, అనంతమైన నీ విశ్వరూప సందర్శన భాగ్యము మాకు కల్గింపుము." అని పరిపరి విధముల ప్రార్థించిరి.

## వాసవీకన్యకాదేవి విశ్వరూప ప్రదర్శనము :-

అంత భక్తవత్సలయైన ఆ ఆదికన్యక "నాయనలారా! మహాతపస్సంపన్నులకు, యోగివరులకు, సమస్త దేవతలకు కూడ చూడశక్యము గాని నా విశ్వరూపమును

ప్రాకృతములైన నేత్రములతో మీరు దర్శించలేరు. అనంత త్యాగధనులైన మీ యందలి వాత్సల్యముతో మీకు దివ్యదృష్టిని ప్రసాదించుచున్నాను. నా విశ్వరూపమును తిలకింపుడు." అని పరమాద్భుతమైన తన విరాట్స్వరూపమును ప్రకటించినది.

సత్యలోకము శిరముగ, సూర్యచంద్రులే నేత్రములుగ, సమస్త దిక్కులు వీనులుగ (చెవులుగ) సర్వవేదములు వాక్కులుగ, సమిష్టివాయువు ప్రాణముగ, ఋషులచే అవ్యక్తమని కీర్తింపబడు సర్వాత్మక శుద్ధ చైతన్యమే హృదయముగ, పృథివి జఘనముగ, భువర్లోకము నాభిగ, నక్షత్రలోకము వక్షస్థలముగ, మహర్లోకము కంఠముగ, జనలోకము ముఖముగ, తపోలోకము లలాటముగ, ఇంద్రాదిలోకపాలకులు బాహువులుగ, సమస్త గంధమే ఘ్రాణేంద్రియముగ, రసనేంద్రియాధారములే దవడలుగ, సమస్త జలగతమైనరసము నాల్కగ, కాలస్వరూపమైన మృత్యువేకోరలుగ, స్త్రీ పుత్రాదులందుండు మోహమే దంతములుగ, మహామాయయే నవ్వుగ, సర్వసృష్టి ఆమె క్రీగంటి చూపుగ, లజ్జాలోభములు మీది క్రింది పెదవులుగ, సృష్టికర్తయైన సమిష్టి ప్రజాపతియే అధోంగమున, సమస్త సముద్రములు గర్భముగ, పర్వత సముదాయమంతయు శల్యములుగ, నదులన్నియు నరములుగ, సకల వృక్షజాతులు రోమములుగ, బాల్యయౌవన కౌమార వార్ధక్యములు గమనముగ, వ్యోమమే కేశములుగ, ఉభయసంధ్యలు వస్త్రములుగ అలరారు ఆ విరాడ్విశ్వరూపిణి యందు సత్వరజస్త మోగుణములు మరియు వాని సాధనములు విష్ణు బ్రహ్మేశ్వరులు మరియు మహాలక్ష్మి మహా సరస్వతి, మహాకాళికలుగను, అతలము మొదలు పాతాళము వరకు వుండు లోకములు, నడుము మొదలు పాదములవరకు యున్న అవయవములుగను ప్రకాశించుచున్న ఊహాతీతమైన పరాశక్తి విశ్వరూపమును భక్తవరేణ్యులందరును తమకు లభించిన దివ్యదృష్టిచే దర్శించగలిగిరి. ఆ విరాట్స్వరూపము అనంతజ్వాలా మాలికలతో ప్రజ్వలించుచున్నది. భయంకరముగ తెరువబడి వున్న ఆమె నోటిలోనికి

సమస్త జీవరాశులు శీఘ్రగతితో ప్రవేశించుచున్నవి. ఆ విశ్వరూపిణి అనేక విధముల ఆయుధములను ధరించి వున్నది. అనంతకోటి సూర్యప్రకాశమై అనంతశీర్ష, వక్త్రనేత్ర, బాహూరు పాదములతో విరాజిల్లుచున్నది. కోటానుకోట్ల మెరుపు దీవెల కాంతితో దుర్నిరీక్ష్యమై అత్యంత భయావహమై బహువర్ణముల నీనుచు ప్రకాశించుచున్నది.

ఆమె తనయందు భూత, భవిష్యత్, వర్తమానములను చూపించినది. కాలానలోజ్వలాభీలమై యొప్పు ఆమె యొక్క విరాట్‌దంష్ట్రా కరాళమున చూడజాలక అక్కడి జనులందరు భయకంపితులై హాహాకారములు గావించుచు తుదకు ధైర్యము వహించి గద్గద వాక్కులతో యీ విధముగ స్తుతించిరి.

"ఓ తల్లీ! మా అపరాధములను క్షమించుము. అనంతము అత్యంత ఘోరము, భయంకరమునైన నీ విశ్వరూపమును చూచుటవలన భీతచిత్తులమైతిమి. పామరులమైన మేము నీ మహత్త్వమును స్తుతింపలేము. ఓ బ్రహ్మాప్రణవ శక్తీ! ఓ హ్రీంకార రూపిణి! సమస్త జగములకు నీవే ఏలికవు. సర్వోపనిషత్తుల సిద్ధాంతం ఫలస్వరూపిణివైన నీకు మాటి మాటికి నమస్కారములు. అగ్ని, సూర్యుడు, చంద్రుడు, సకల ఔషధములు, సమస్త దేవదానవ గణములు మున్నగు సర్వసృష్టికి జన్మదాత్రివై, సర్వము నీవేయై వెలుగొందుచున్న నీ విశ్వరూపమునకు నమస్కారములు. దేనివలన సముద్రములు, పర్వతములు, నదులు, వృక్షములు, రసములు, పశువులు, పక్షులు మున్నగున్నవన్నియు వుత్పన్నమైనవో అట్టినీ విశ్వరూపమునకు నమస్కారములు. ఓ పరమేశ్వరీ! లోకాతీతమై, భయంకరమై యున్న నీ యీ విశ్వరూపమును చాలించి అతిమనోహరమైన నీ తొల్లింటి రూపమును మాకు చూపించుము." అని ప్రార్థించిరి.

ఈ రీతిగ భీతిచెందియున్న సమస్త భక్తజనులను జూచి దయాసముద్రురాలైన, జగన్మాత ఘోరమైన తన విశ్వరూపమును చాలించి సుందరమగు తన

వాసవీకన్యకారూపమును చూపించినది. మిక్కిలి కోమలములైన అవయవములతో దయాపూర్ణములైన నేత్రములతో చిరునవ్వు లొలికించు ముఖ కమలముతో వొప్పుచున్న ఆ సుందరరూపమును తిలకించి భయరహితులై శాంతచిత్తులైన ఆ భక్తజనులు ఆనందాతిశయముతో ఆమెకు నమస్కరించిరి. అంతట ఆ వాసవీదేవి "ఓ భక్తులారా! మీ యందలి వాత్సల్యముతో లోకాతీతమైన నా విశ్వరూపమును మీకు చూపించితిని. నాలుగు వేదములను సాంగోపాంగముగ అధ్యయనము చేయుటవలనను, అష్టాంగ యోగమును సాధించుట వలనను మహత్తర దానవ్రతము వలనను, ఘోరమైన తపస్సుచేతను, అనేక క్రతువులు చేయుట వలననైనను, నా కరుణ లేకపోయినచో నా యీ విశ్వరూపమును దర్శించుట శక్యముగాదు. అట్టినా అద్భుతరూపమును చూచి మీరందరు ధన్యులైరి. నా దివ్యదర్శనము చేత మీ పాపములన్నియు నశించిపోయినవి.

ఓ భక్తవరులారా! నేనిపుడిక అగ్ని ప్రవేశము గావించెదను. నాతో పాటు 102 గోత్రముల పుణ్యదంపతులు కూడ అగ్నిలో ప్రవేశించెదరు. అటుపై నేను అర్చావతారమూర్తినై సాక్షాత్కరించెదను. భువనేశ్వరినైన నన్ను యికపై **"శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరి"** నామముతో ఆరాధించుచు కృతార్థులుకండు. అనునిత్యము శ్రీవిద్యానుసారముగ వేదోక్త విధానమున పంచాయతనదేవతల మధ్య మూలస్థానమేర్పరచి అందు వాసవీకన్యకాయంత్ర సహితముగ నా మూర్తిని ప్రతిష్ఠించి షోడశోపచారదులైన సర్వసపర్యలతో ఎల్లవేళల నన్ను అర్చింపుడు. నా మంత్రమును జపించుచు సమస్త కామితఫలములను పొందుడు. లక్ష్మీపార్వతీ సరస్వతులు అను ముగ్గురు దేవతల లాంచనములతో విరాజిల్లు సర్వాంగసుందరమైన నా అర్చావతరము యొక్క దివ్యమైన చతుర్భుజ రూపమును గాని లేక భవ్యమైన ద్విభుజరూపముగాని ఏర్పరచుకొని సదానన్ను పూజించువారికి సమస్త సంపదలు సంపూర్ణముగ చేకూరగలవు. గృహములలో వివాహాది శుభకార్యములందును, వనములయందును నా ప్రతీకరమైన

కలశమును ప్రతిష్ఠించి పూజించవలెను. ఆలయములలో నా విగ్రహమును పూజించవలెను. నా భక్తులను ఎల్లవేళల అన్ని విధముల నేను కాపాడుచుండెదను. ఇది నా ప్రతిజ్ఞ అని పలికి ఆ వాసవీ కన్యకాదేవి మహాగ్నిలో ప్రవేశించినది. అంతట ఆ అగ్నికుండము నుండి లీలాశుకారోహిత దివ్యపద్మమును, వేదపుస్తకమును అక్షమాలతో గూడిన అభయముద్రను, వరద ముద్రను కలిగియున్న నాలుగు భుజములను ధరించినదియు, హ్రీంకార వహ్నిమధ్యములో విరాజిల్లుచున్న విశాల దివ్యపద్మముపై నిలచినదియునైన శ్రీవాసవీదేవి అర్చావతరమూర్తి ఆ అగ్నికుండము నుండి ఆవిర్భవించినది. ఆ దివ్యమూర్తిని చూచి అందరును ఆశ్చర్యచకితులైరి. ఆ మూర్తిని మనసులో నిలుపుకొని అమితోత్సాహపరులై జయజయధ్వానములు గావించిరి. వెనువెంటనే 102 గోత్రముల పుణ్యదంపతులు అగ్నికుండములలో ప్రవేశించిరి.

అంతలో అబ్బురముగొల్పు విధమున ఆకాశము నుండి దివ్యవిమానములు అక్కడి కరుదెంచినవి. అగ్నిప్రవేశము గావించిన పుణ్యవైశ్య దంపతులు తమ తమ గుండముల నుండి కాంతి స్వరూపులై వెలువడి ఆ విమానములనధిరోహించిరి. సతీసమేతులైన బ్రహ్మవిష్ణు మహేశ్వరాదులు, సమస్త దేవగణములు గగనసీమలో నిలచి ఆదిపరాశక్తియైన వాసవీకన్యకను కీర్తించుచుకుసుమ వర్షము కురిపించుచుండగ భువనేశ్వరీదేవి వాసవీకన్యకా హోమకుండము నుండి వెలువడి అద్భుత విమానారూఢయై వైశ్యదంపతులతో గూడి తన ఆవాసమైన శ్రీచక్రనగరమును సర్వోన్నత లోకమునకు తరలి పోయినది.